# సప్తవర్ణాల... ఉష

## సి.హెచ్. సంపత్ కుమార్

"మీ వయస్సెంతా!?" ప్రశ్నించింది తను.

"అవసరమా?" అన్నట్టుగా చూసాను.

"....."

ఫాన్‌గాలి తప్ప అంతా నిశ్శబ్దం ఆ గదిలో...

"చెప్పండీ...!"

"మూడుపదుల దగ్గర..."

"కరెక్ట్‌గా చెప్పండి...!" కళ్ళ తోనే అడిగింది.

"గడచిన కాలం, పోయిన సొమ్ములు తిరిగిరావేమో" చెప్పాను.

"కహానీలు వద్దు...!" గల గల నవ్వుతూ అంది..

"ఇరవై ఎనిమిది, ఆగస్టు పదికి పూర్తయింది." చెప్పాను.

"ఏం సాధించారు!?" బాకులా దూసుకొచ్చిందా ప్రశ్న. ఎప్పుడు సీరియస్ విషయాలు, రాజకీయాలు, సామాజిక రుగ్మతల గురించి నాతో చర్చించే సంధ్య నన్ను ఇలా అడిగేసరికి ఊహించని స్థితిగా మారింది. నన్ను నేనే కంట్రోల్ చేసుకుంటూ...

"ఏ విషయంలో!?" అడిగాను.

"ఏ విషయంలోనైనా.."

ఒక్కసారి గాలి బలంగా పీల్చి వదులుతూ..." కొన్ని సాధించాను." నా మాటలు పూర్తికుండానే-

"మరెన్నో వదులుకున్నారూ..!" మరోసారి పడినచోటే మరోదెబ్బ.

"నేనేమీ వదులుకోలేదు, అయినా... కొన్ని పొందాలంటే... ఇంకొన్ని వదులుకోవాలి కదా..!?"

"అయితే ఒక్కటి సాధించడానికి, పది వదులుకోవాలా... ఇలా వదిలేసినవే ఎక్కువైతే...జీవితం నిన్ను వదిలేస్తుందేమో..! ఎన్నాళ్ళిలా... ఒంటరిగా.. పుస్తకాలు, చదువు, నోట్స్, పిల్లలు, ట్యూషన్స్ పాతజ్ఞాపకాలని తలుచుకుంటూ.. విలువైన వర్తమానాన్ని గతం తాలుకు గాయంతో చేదుగా మార్చుకుంటూ ఉండిపోతావ్??!"

నానుంచి మాటలకి అడ్డుకట్టవేస్తూనే..

"నటిస్తున్నావ్...! నిన్ను నీవే మోసం చేసుకుంటూ, దూరంగా పారిపోయి ఒంటరిగా బాధపడుతూ...పైకి మాత్రం ఆనందంగా, అందంగా నవ్వుతూ... ఎన్నాళ్ళిలా...." తను మాట్లాడుతూనే వుంది.

"సంధ్యా..! ఇంతకి నీవు చెప్పేదేంటి..?" అసహనంగా అడిగాను.

"మరో కప్పు కాఫీ ముందుంచింది..., "తాగు! కాఫీ చల్లారినా మగాడు ముదిరినా... రంగు, రుచి వాసనలుండవ్.." కవ్విస్తూ..కళ్ళెగరేస్తూ అంది.

"అయితే..!" కాఫీ చేతులోకి తీసుకుంటూ అడిగాను.

"పెళ్లిచేసుకో...!" కూల్‌గా చెప్పింది.

తన ఇంతసేపు క్లోజ్ ఎన్‌కౌంటర్ ఇదన్నమాట.. మనస్సులో అనుకుంటూ



“ఎవరినీ...!?”

“నీకిష్టమైన వాళ్ళని, నీకు నచ్చిన క్వాలిటీస్‌గల అందమైన ముఖచిత్రాన్ని”.

“ఉందంటావా...?” కాఫీ కప్పును ప్రక్కనపెడుతూ..

“నీకు తెలియదా..!”

“సంధ్యా...! నీకు తెలుసు. తన దారి తను చూసుకొని నాకు దూరంగా వెళ్లింది కదా..!”

“వెళితే..?!” గురువుగారు ఇక పెళ్ళే చేసుకోకుండా ఇలాగే ఉండిపోతారా?”

“నా మనస్సులో ‘ఉష’ని తప్ప మరొకరిని ఊహించుకోలేను. అసలీ ఆడవాళ్ళ మీదనే నమ్మకం పోయింది. సిన్సియర్‌గా ప్రేమిస్తే ...చఁ...”

“తప్పుగా అర్థం చేసుకుంటున్నావేమో...!”

“మరెందుకు నన్ను పిచ్చివాణ్ణి చేసింది..?” కోపం, కన్నీళ్ళు నాలో.. “రమణా..! గాయం పెద్దదే. కాదనను. కాని, కట్టుకట్టుకుని నయం చేసుకోలేనంత భయంకరమైనది కాదు.

దయచేసి నేను చెప్పేది విను...

“ఒక్కసారి తన కోణం నుంచి ఆలోచించు. సమాజానికి భయపడో, తన కుటుంబం గౌరవం కాపాడటం కోసమో... ఏదైన సమస్యలో చిక్కుకోని మరోకరిని చేసుకుని ఉండవచ్చు కదా...!”

“మరెందుకు ప్రేమించాలి...? ధైర్యం, సమాజం, కుటుంబగౌరవం ఇవన్నీ గుర్తుకు రాలేదా..! నన్నెందుకు పిచ్చివాణ్ణి చేసింది... అంటావ్...”

ఈ మాటలు సినిమా డైలాగులుగా బాగా పనిచేస్తాయి తప్ప, ప్రాక్టికల్‌గా ఆలోచించేవాళ్లకి కాదు.”

అయినా... ఈ లోకంలో అన్ని పెళ్ళిళ్ళు తాము ఇష్టపడిన వారితోనో...ప్రేమించిన వాళ్లతోనే జరుగుతున్నాయా..?”

తను మాట్లాడుతూనే వుంది. అవి అలల్లా నన్ను తాకుతూనే వున్నాయి.

“అలాంటప్పుడు పెళ్ళెందుకు చేసుకోవటం... లీగల్ వ్యభిచారం కోసమా..!? యూ మీన్ సెక్స్, శారీరక వాంఛ...!” ఎదురుదాడికి జాగ్రత్తగా....

“..........”

మరోసారి మౌనం మా ముందుకూర్చుంది.

“ఆడవాళ్ళు ఇంతే... ప్రేమదోమాంటూ పలకరించడం...తమ అవసరాలు తీరగానే ప్లాస్టిక్ ‘టీ’ కప్పు పక్కన పడేయటం, సిన్సియర్ ప్రేమకి విలువ లేదు నేస్తం...! తన కోసం ఎన్నో విలువైన క్షణాలనీ సంవత్సరాలని వృథా చేసుకున్నాను. నీకు చెప్పాను కదా...!” తెలియకుండానే కన్నీళ్ళునాలో....

“రమణ...! ప్లీజ్! కంట్రోల్ యువర్‌సెల్ఫ్, ఐ కెన్ అండర్‌స్టాండ్ యువర్ ట్రూ లవ్..బట్..”

తన చేతుల్లోకి తీసుకుంది.

“తనకు, నీకు మువ్వలకి, గవ్వలకు ఉన్నంత తేడా ఉంది. నీవు గవ్వల్లా స్వచ్ఛంగా ఉండాలనుకున్నావు, తను మువ్వలా సవ్వడి చేస్తూ తన సవ్వడిని అమెరికాలో వినిపించాలనుకుంది.” తన కళ్ళలో ఏదో బాధని కన్పించకుండా ప్రయత్నిస్తూ చెప్తోంది.

తనో ‘మెడికో’ ఎన్నయినా చెప్పుతుంది. ఏమైనా మాట్లాడుతుంది. అనుకుంటున్నావు కదూ..! ఉఁ... ఈ ఆరునెలలల పరిచయంలో ఇద్దరం ఎన్నో సాయంత్రాలు, ఇలా అనేక విషయాలను చర్చిస్తూ...క్యాంటిన్ కబుర్లతో కాఫీ కప్పులతో కాలక్షేపం చేస్తూ సాగించాం.

దేనికోసం ఈ పరుగు...., ఎన్నాళ్ళిలా ఒంటరిగా.. ఎవరికోసం...? జీవితం చాలా గొప్పది. విలువైనది కూడా. ఏపని ఎప్పుడు చేయాలో అప్పుడే చేస్తేనేదానికో అర్థం.

కొన్ని పనులు ఆలస్యం చేసినందుకు బాధపడతాం. ఇంకొన్ని పనులు ఆలస్యం చేయనందుకు బాధపడతాం... ఉరుకులు పరుగుల ఈ జీవితం పరుగెత్తటమే. ఇంకేమయినా ఉందో తెలియదు. ఉరుకులు పరుగుల ఈ జీవితంలో మనకోసం ఒకరు కావాలి. మన అలసటలో, ఓటమిలో.. గెలుపులో ప్రతిక్షణం నిన్ను అంటిపెట్టుకుని ఉండే ఓ మంచిమనిషి కావాలి. అది భార్య అయితే...భర్త అయితే..

ఒక్క క్షణం ఆగి... “ఇక నీవడిగావు, సెక్స్ కోసమా... కాదని చెప్పలేను. ఈ లోకంలో మానవ సంబంధాలు ఇంతమాత్రాన బలంగా ఉన్నాయంటే దానికి కారణం ఆడ, మగ మధ్యగల ఒక తియ్యని రహస్యం. అది లేకుంటే ఎవరైనా ఉండగలరా... ఈ సృష్టి ఉంటుందా...!”

నేను ప్రేక్షకుడిలా.. తను మాట్లాడుతూనే వుంది.

“ఇక నీ గతం తాలుకు ప్రేమ, వాటితాలుకు జ్ఞాపకాలంటావా!,,,,తీపిగురుతులుగా కాలం రాసే జీవితపుస్తకంలో మిగిలిపోనీ...”

“నీవు చెప్పిన మాటలు వింటుంటే అంత నిజాయితీగల అమ్మాయి ఎందుకలా చేసిందా అనే సందేహం రాకమానదు. ఏదైన బలమైన కారణం లేకపోలేదన్పిస్తుంది.

ఆడవాళ్ళు, ఆడవాళ్లకే సపోర్ట్ చేస్తారు. తను అందుకే ఇలా మాట్లాడుతుంది అనుకోకు.”

“తనకు, నీకు మువ్వలకి, గవ్వలకు ఉన్నంత తేడా ఉంది. నీవు గవ్వల్లా స్వచ్ఛంగా ఉండాలనుకున్నావు, తను మువ్వలా సవ్వడి చేస్తూ తన సవ్వడిని అమెరికాలో వినిపించాలనుకుంది.” తన కళ్ళలో ఏదో బాధని కన్పించకుండా ప్రయత్నిస్తూ చెప్తోంది.

“నేను కూడా పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను. ఇంట్లో సంబంధాలు చూస్తున్నారు.” ఈ ఆరునెలల మన పరిచయంలో ఎంతో దగ్గరితనం, ఆత్మీయత వాటిని మాటల్లో చెప్పలేనితనం. నా ప్రతి విషయం, నా ప్రతి మూమెంట్ తనకి తెలుసు. తను కూడా తన ప్రతి విషయాన్ని, ఆనందాన్ని, సంతోషాన్ని నాతో పంచుకునేది. నా సమస్యని సున్నితంగా విశ్లేషిస్తుంటే కాదన లేకపోయాను.

***

వర్షం కుండపోతగా పడుతోంది.

బస్‌స్టాప్ నుంచి నడుచుకుంటూ వస్తున్నా... నేను వర్షంలో తడిసి ముద్దవుతున్నాను.

నా వెనకాలే.. మువ్వల సవ్వడి...వర్షం బిందువుల సెగల్లో సైతం స్పష్టంగా వినబడుతుంది.

తల త్రిప్పి చూసాను. పింక్ కలర్ చుడిదార్‌లో అందమైన అమ్మాయి చేతిలో పూలపూలగొడుగు.

ఒక్క క్షణం నాలో ఏదో తెలియని అనుభూతి. ఈ అమ్మాయి నా......”

ఆలోచన పూర్తికాకుండానే–

“ఆగండీ...!” తియ్యని పిలుపు.

“నా మనస్సులో మాట వినబడిందా...! అనుకుంటూ..” పక్కకి చూసాను. ఎవరు లేరూ..!” ముందుకు నడుస్తున్ననాకు, మరో పిలుపు.

“గ్రీకువీరుడా..! నిన్నే..!”

అక్కడే ఆగాను.. వర్షం హుషారుగా కురుస్తూనే వుంది.

జేబులో రుమాలుతో ముఖాన్ని తుడుచుకుంటున్నా.

“మాది మీ అక్కయ్యవాళ్ళ ఇంటిపక్కనే... రండి...” అంటూ గొడుగులోకి ఆహ్వానిస్తూ చెప్పింది.

“అందగత్తె అనుకున్నాను. అందమైన మనస్సు కూడా ఉందే..” గొణిగాను.

“ఏమన్నారూ...” కాల్చిన మొక్కజొన్నని నాకందిస్తుంది..అడిగింది.

“నథింగ్” చెప్పాను. వర్షం హుషారుగా పడుతుంది.

‘ఇదే మా ఇల్లు...’ అంటూ రయ్యిన ఇంట్లోకి దూరి తలుపుమూసుకుంది.

నా గుండె ఆగిన చప్పుడు.

***

అక్కవాళ్లు ఊరెళ్ళారు.

ఇంట్లో ఒంటరిగా టివి చూస్తూ ఠాగూర్ గీతాంజలితో కుస్తీపడుతున్నాను.

కాలింగ్‌బెల్ మ్రోగింది. ఎదురుగా ఓ అబ్బాయి.

“ఈ బాక్స్, ఉషక్కా...! నీకిచ్చి రమ్మంది..” రయ్యిన పరిగెత్తాడు.

“ఉష! ఎవరీ త్రిషా..!? కిటికీలోంచి అటువైపు చూసాను.

డాబాపైనుంచి చూస్తుంది తను.

అందమైన పేరే..! బాక్స్ తెరిచాను. పులిహోర, చపాతీలు ప్లస్ చిన్న పేపర్ ముక్క.

‘మీ అక్కయ్యవాళ్ళు ఊరెళ్ళారని పంపిస్తున్నా...– ఉష.’

నీలి ముత్యాలాంటి అక్షరాలు, ఒక్క వాక్యంలో ఎంత ఆప్యాయత! మనస్సులోనే ‘థాంక్స్’ చెప్పుకుంటూ గబగబా లాగించేసాను.

రోజూ కళ్ళతోనే నన్ను గమనిస్తుంది. ఒక్కమాట కూడా మాట్లాడని తను ఇలా ఎందుకు చేస్తుంది.

“ప్రేమా! నేనెప్పుడో తన ఒడిలో వాలిపోయాను. తన నుంచి తెలియదు.

తన నెంబర్ కనుక్కుని గ్రహంబెల్‌తో రాయ

బారం పంపించాను. తన అభిరుచులు, ఆలోచనలు, అలవాట్లు, చదువు అన్నీ చెప్పింది. కాని నాపై తనకున్న అభిప్రాయాన్ని చెప్పలేదు.

అడగలేకపోయాను...!

***

''రమణన్నయ్యా..నిన్ను ఉషక్క రమ్మంటుంది'' చెప్పాడు ఆ అబ్బాయి.

వెంటనే వెళ్ళాను. ఆ అబ్బాయి వెంబడి.. ఇంట్లో ఎవరూలేరు... తను, నేను. ఆ అబ్బాయి.

ఇంట్లోకి వెళ్లగానే ఫ్యాన్ రెక్కల సందులోంచి నాపై పూలవర్షం కురిపిస్తూ.. తన మనస్సులోని మాటని చెప్పింది.

నన్ను నేనే నమ్మలేని తనం. ''ఏమన్నారూ..?'' మరోసారి వినాలని.

''తన్ను గట్టిగా కౌగిలించుకుని, నేను నీకు నచ్చానా, లేదా అని అడగను. నీవు నాకు బాగా నచ్చావు. అంతే. నీకు ఇష్టంలేకుంటే నన్ను వదిలించుకుని వెళ్ళు...'' ఒకొక్కమాటనే నెమ్మదిగా హృదయానికి హత్తుకునేలా చెపుతోంది.

తనని నా ఒళ్ళోకి తీసుకుని నుదుటిపై నా తొలిప్రేమ సంతకాన్ని ఉంచాను. మా ప్రేమకి మౌన సాక్షి ఆ కళ్ళు మూసుకున్న బాలుడు.

మళ్లీ వర్షం మొదలయింది.,,

తను పూలగొడుగుతో నాతో పాటే మా ఇంటివరకు...

***

సాయంకాలం...!

గదిలో ఒంటరిగా ఠాగూర్ గీతాంజలితో... మదినిండా రకరకాల ఆలోచనలు, సంధ్య, ఉష మాటలు...పదే పదే విన్పిస్తున్నాయి. సంధ్య చెప్పింది నిజమేనా...! ఎంతకాలం ఇలా ఒంటరిగా...నాకు నేను నాలో నేను శిలల శిథిలమౌతూ...

కన్నవారికి దూరంగా... ఉష ఎందుకిలా చేసింది. తన స్వార్థం తను చూసుకున్నప్పుడు నేనెందుకు తన జ్ఞాపకాలతో ఒంటరిగా ఏం సాధించడానికి, ఆలోచన కెరటాలు సునామీలా చుట్టుముడుతున్నాయి.

వర్షం వచ్చేలా వుంది. సిగరెట్టు చివరి దమ్ములాగించాను.

ఒక నిర్ణయానికి వచ్చి... సంధ్య మొబైల్‌కి డయల్ చేసాను.

''సంధ్యా!...నేను...''

''చెప్పు.'' దగ్గరితనం, ఆత్మీయత విన్పించింది ఆ గొంతులో.

''నీతో మాట్లాడాలి...'' నా మాటలు పూర్తికాకుండానే.

''కాఫీ గురించా..? ఇప్పుడు కుదరదు...మా డీన్ సుబ్బారావ్ రెండోపెళ్ళాం తమ్ముడి పెళ్లికి మా బాచ్ అంతా వెళ్తున్నాం..'' చెప్పింది నవ్వుతూ.

''ఎన్నిగంటలకి?'' అడిగాను.

''ఈవినింగ్ సిక్స్‌థర్టీకి.''

''అయితే ఐదుగంటలకి కలుస్తాను. సరేనా..!?''

''సరే'' కట్‌చేసింది.

***

మొదటిసారిగా సంధ్య పరిచయం సైకాలజీ సెమినార్‌లో, ఆ తర్వాత వాళ్ళ ఇంటి ఓనర్ పిల్లకి ట్యూషన్ మాస్టారుగా. అది స్నేహంగా మారింది. ఇన్నాళ్ళ మా పరిచయంలో తను నాకో మంచి స్నేహితురాలు, నేను కూడా అలాగే.. ఇప్పుడు నాలో ఏదో భయం అయినా ముందుకు నడిచాను.

సంధ్య నాకోసమే ఎదురుచూస్తుంది. పలకరింపులయ్యాక..

''సంధ్యా..! నేనూ..!!'' ఆగాను ఏదో తెలియని భయం.

''చెప్పు'' కనుబొమలు ముడి వేసుకుంటూ క్యాజువల్‌గా అడిగింది.

''నన్ను పెళ్ళి చేసుకుంటావా? '' తడబడుతున్న గొంతుని సరిచేసుకుంటూ అడిగాను. బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను.

తను నన్నే చూస్తోంది.

నా గురించి, నా వ్యక్తిగత జీవితానికి సంబంధించి ప్రతి విషయం నీకు తెలుసు. నా డైరీలో రాతలు, నా ప్రేమ, నా ఉష తన తాలూకు జ్ఞాపకాలు, వేరెవరికైనా చేసుకుంటే ఆ వచ్చిన వాళ్ళకి ప్రతిదీ అనుమానమే... మళ్ళీ నరకం... నా గురించి బాగా తెలిసిన ఆలోచించే మంచి మనస్సున్నదానిని.. ఇష్టం లేకుంటే...

**నా గురించి, నా వ్యక్తిగత జీవితానికి సంబంధించి ప్రతి విషయం నీకు తెలుసు. నా డైరీలో రాతలు, నా ప్రేమ, నా ఉష తన తాలూకు జ్ఞాపకాలు, వేరెవరికైనా చేసుకుంటే ఆ వచ్చిన వాళ్ళకి ప్రతిదీ అనుమానమే... మళ్ళీ నరకం... నా గురించి బాగా తెలిసిన ఆలోచించే మంచి మనస్సున్నదానిని.. ఇష్టం లేకుంటే...**

మౌనదేవత మా ముందు తచ్చాడుతుంది.

''బాబా టెంపుల్ మెట్లమీద నీ కోసం ఎదురుచూస్తూ వుంటాను..'' ముందుకు నడిచాను.

***

గుడిమెట్లమీద సంధ్య కోసం ఎదురుచూస్తున్నాను. గుండె వేగంగా పరిగెడుతుంది. సమయం ఆరుగంటలు. ఎదురుగా ఓ అబ్బాయి. ఎక్కడో చూసినట్టు గుర్తు.

''సార్ మిమ్మల్ని సంధ్యక్క ఈ అడ్రస్సుకు రమ్మన్నారు. ''చేతిలో ఉత్తరాన్ని ఉంచి తప్పుకున్నాడు.

అడ్రస్సు వెతుక్కుంటూ ఆ అబ్బాయితో పాటూ... ఆటోలో బయలుదేరాం...

పోస్ట్‌మార్టమ్ గది ముందు జనం రణగొణగా మాట్లాడుకుంటున్నారు.

''సంధ్యా'' గబగబా పరుగుతీసాను.

దూరంగా స్ట్రెచర్ మీద తెల్లని దుస్తుల్లో దేవదూతలా ఓ దేహం.

నాచేతిలో ఓ ఉత్తరాన్ని ఉంచుతూ ఏడుస్తునే వుంది సంధ్య.

కాగితాన్ని విప్పాను.

నీలిముత్యాల్లాంటి అక్షరాలవెంట పరుగెడుతున్నాయి నా కళ్ళు. గుండె బరువెక్కుతుంది.

డియర్ గ్రీకువీరుడా...! నేను నీ వెన్నెల నవ్వుని. వర్షం అల్లరి మువ్వల సవ్వడిని.. నీ హృదిలో విరిసిని ప్రేమ ఉషస్సుని.

గుర్తుపట్టావా??!?

గుర్తుకురావటం లేదా... అదేరా.. నీ పూలగొడుగుని. పులిహోర పాకెట్‌ని, అందమైన రాక్షసిని... గుర్తొచ్చాను కదూ!?

ఇన్నాళ్ళుగా నీకు తెలియకుండా దాచిన ఓ నిజాన్ని నీకు చెప్పాలని, చివరిసారిగా నీ కౌగిలిలో కరిగిపోవాలి అని ఎంతో ఆశపడ్డాను. కానీ...

నిన్ను నేను ఎంతగా ఇష్టపడ్డానో అంతకంటే ఎక్కువగా ఆ దేవుడు నాపై ఇష్టపడ్డాడు. అందుకే నిన్ను చూడాలని, నిన్ను పెళ్లిచేసుకుని గంపెడు పిల్లల్ని కనాలని ఆశగా ఉన్న మరి వదలకుండా తొందర చేసాడు.. పాపం కాదనలేకపోయాను.. అందుకే నిన్ను వదిలి దూరంగా..

అసంపూర్తిగా ఉత్తరం.. అసంపూర్తి జీవితంలా..

కాళ్ళకింద భూమి కంపిస్తున్నట్టుగా ఉంది. నవనాడులు కృంగిపోతున్నాయి. కళ్ళనిండా నీళ్లు..

''అవునూ! రమణ... ఉషనే ఇంతకాలం మా హాస్పిటల్‌లోనే చికిత్స చేయించుకుంటోంది. కోటిలో ఒక్కరికి వచ్చే జబ్బు. అది తెలిసిన క్షణం నుంచి నిన్ను దూరం చేసుకుంది. విషయం తెలిస్తే నీవు పిచ్చివాడిలా మారతావని ఏడుస్తూనే వుంది సంధ్య.

ఉబికివస్తున్న దుఃఖాన్ని కంట్రోల్ చేసుకుంటూ, అవును బాబూ! ... ఆ రోజు నీ గురించి తన ప్రేమ, పెళ్లి గురించి నాతో మాట్లాడుతోంది. హఠాత్తుగా ముక్కులోంచి రక్తం... వెంటనే హాస్పిటల్ చేర్పించాను.

ఎన్నో పరీక్షలు.. రకరకాల మందులు.. ఫలితం లేదన్నారు. మరికొన్ని రోజులే తను మాతో ఉంటుందని కఠినంగా చెప్పారు వైద్యులు.

ఈ విషయం తెలిసిన నా ఉష నీతో అబద్ధం చెప్పమంది. స్టేట్స్‌లో ఉన్నవాణ్ణి పెళ్ళి చేసుకుని వెళ్లినట్టుగా చెప్పమందీ బాబూ... ఊహూ..తన మాటలనీ ఎప్పుడు కాదనలేదు.. ఒక్కొక్క మాటనే భారంగా బరువుగా చెపుతూ కుమికుమిలి ఏడుస్తున్నాడూ...

''నాన్న! ఊరుకో...'' సముదాయించుతుంది సంధ్య.

నా హృదయం లయ తప్పుతోంది. నా ఊపిరి, నాప్రాణం.. నాసప్తవర్ణాల ఉష.''

''.....''

''తను చెప్పినట్లుగానే తన కళ్ళని తీసి వేరొకరికి అమర్చాం..!'' డాక్టర్స్ చెపుతున్నారు.

వర్షం మొదలయింది. తూరుపు మసకబారుతుంది.

కప్పకూలిపోతున్న నన్ను తన ఒళ్ళోకి తీసుకుని ఓదార్చుతుంది సంధ్య.

★